క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బంగారుపాళెం: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన వినతులను స్వీకరించారు. భూసమస్యలు, దారి సమస్యలు, భూ పరిహారానికి సంబంధించి ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. తమ పరిధిలోని సమస్యలను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 7 వినతులు



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు నగర ప్రజలు వినతిపత్రాలు అందించారు. ప్రజల నుంచి అందిన వినతులపై శాఖాధిపతులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ 3, ప్రజారోగ్య విభాగం -1, రెవెన్యూ-1, టీపీవో -1, హౌసింగ్ -1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా.లోకేష్, మేనేజర్ తనూజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాత

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులకు షేర్ జీసస్ మినిస్టరీస్ సంస్థ సభ్యులు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించారు. సంస్థ సభ్యులు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ లలిత చేతుల మీదుగా రూ.33 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందించారు. వారికి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత చదువుల కోసం రూ.50 వేల విరాళం



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ రజనీకాంత్

గుడిపాల: మండలంలోని వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ సోమవారం ఐరాల మండలం కాణిపాకపట్నం దళితవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఇలంగో కుమార్తె పవిత్ర ఉన్నత చదువులు కోసం రూ.50 వేలు నగదును విరాళంగా అందజేశారు. ఇంటర్‌లో 900 మార్కులు సాధించిన పవిత్ర ఐఏఎస్ చేయాలని పట్టుదలతో ఉంది. అయితే డిగ్రీ పూర్తి చేసేందుకు సర్పంచ్ రజనీకాంత్ తమవంతు సాయంగా రూ.50 వేలు అందజేశారు. గుడిపాల మండల యువత అధ్యక్షుడు శిలంబరసన్, సాయి పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని కోనసీమ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం

పలమనేరు: పట్టణానికి చెందిన హిందూ సంఘాల నేతలు సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులో తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూమతం, సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయనకు హిందువులు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఆయన హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయనపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంచి చేశాం.. | ప్రజల ముందుకు వస్తున్నాం

- ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చేలా సంక్షేమ పథకాలు అందించాం
- అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పాలన
- సమస్యలు పరిష్కరించడానికే ప్రజల వద్దకు వస్తున్నాం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



దళవాయిపల్లె గ్రామంలో నూతన పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి

యాదమరి: నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన మంచితో ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చేలా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని 184 గొల్లపల్లె సచివాలయ పరిధిలోని నూరేనగర్, దళవాయిపల్లె గ్రామాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారికి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

శ్మశాన దారి సమస్య పరిష్కరించండి..

నూరే నగర్ గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామ శ్మశాన వాటికకు దారి సమస్య ఉందని, పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబును కోరారు. అలాగే గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేసేవారు లేకపోవడంతో కాలువల్లో మురుగు నిండిపోయి ఉందన్నారు. అలాగే సీసీ రోడ్లు వేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. అలాగే జగనన్న అందించే సంక్షేమ పథకాలు కూడా ఏదైనా కారణం చేత రాకపోయి ఉంటే వారికి కూడా అందేలా చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు ప్రజలంతా జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైఎస్ ఎంపీపీ రవీంద్రబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నాయకులు బిర్లా, కబీర్‌బాషా, శేఖర్, చిన్నబ్బరెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

యాదమరి మండలంలో కొత్తగా మంజూరైన 366 కొత్త పింఛన్లను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి దళవాయిపల్లెలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న సీఎం కాగానే పార్టీలకు అతీతంగా పింఛన్లు ఇస్తున్నారని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మేం చేసిన మంచిని గుర్తు పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



గుడిపాల: సంపూర్ణ పోషక కిట్ అందజేస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

గుడిపాల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తోయా లక్ష్మి, సర్పంచ్ పెరిల్లా అన్నారు. సోమవారం కిల్లారిపల్లె, 189 కొత్తపల్లె, అంగన్‌వాడీ కేంద్రంలోని లబ్ధిదారులకు జాతీయ వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రేషన్‌ను ఇంటికే పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఒకసారి రక్తహీనతకు గురైతే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని, తద్వారా వ్యాధులు త్వరగా వస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, ఇందిర, నిర్మల,గౌరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు..

ఫుట్‌బాల్ పోటీల్లో పూతలపట్టు విజయం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: రాష్ట్రస్థాయి మినీ ఫుట్‌బాల్ పోటీల్లో పూతలపట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు 3వ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు పూతలపట్టు ఎంపీడీఓ గౌరి సోమవారం విద్యార్థులను అభినందించారు. పూతలపట్టు అన్నపూర్ణ మైదానంలో మినీ ఫుట్‌బాల్ టోర్నీ ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలకు 13 జట్లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో పూతలపట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతిని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్, మోహన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కృష్ణ, ఢిల్లీరెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటరత్నం

చిత్తూరు కలెక్టరేట్: మొదటి సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులు ఇంజినీరింగ్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రంగనాథం, ప్రిన్సిపల్ వెంకటరత్నం సూచించారు. సోమవారం ఆ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో, అంకితభావంతో పాఠాలు, ప్రయోగశాలల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. నైపుణ్యాలను పెంచుకుంటే ఇంజినీరింగ్ తరువాత ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శరవణన్, హెచ్‌ఓడీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాదిరెడ్డిపల్లెలో గడప గడపకు..

యాదమరి: మండలంలోని మాదిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు అంతా హాజరు కావాలని కోరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పల్లె ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛతా పక్వాడ్



ఎగువ వెంకటాపురం పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ-1 హేమలత

తవణంపల్లె: ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఎంఈఓ-1 హేమలత తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య, నీటి వినియోగాన్ని పరిశీలించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ వరకు స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం రోజు వారి కార్యక్రమాలను నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈఓతో పాటు హెచ్‌ఎం గాయత్రిదేవి, ఉపాధ్యాయుడు నటరాజ్, సీఆర్‌పీ చిట్టిబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

బంగారుపాళెం: మండలకేంద్రం బంగారుపాళెంలో బుధవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు బాలాజీ, ధనుంజయ తెలిపారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణానికి చెందిన ప్రబోధ సేవాసమితి-ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక రాజావీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, గీతాలాపన, భజన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 9వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం శ్రీకృష్ణభగవానుడి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీకృష్ణ భగవానుడి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

వాసవీక్లబ్ సేవలను విస్తృతం చేయండి



గాంధీ సర్కిల్‌లో సిమెంటు బెంచీలను ప్రారంభిస్తున్న క్లబ్ నిర్వాహకులు

చిత్తూరు రూరల్: నగరంలో వాసవీక్లబ్ సేవలను విస్తృతం చేయాలని ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అన్నారు. చిత్తూరు నగరంలోని సోమవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ సర్కిల్ వద్ద సిమెంటు బెంచీలను లాంఛనంగా ఆమె ప్రారంభించారు అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో అమ్మకు వందనం అనే కార్యక్రమంలో తల్లులు పాలిచ్చే గదిని ప్రారంభించారు. సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేయాలని సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, సభ్యులు ఓఆర్ నాగేంద్ర, బాలాజీ, ప్రభాకర్ శెట్టి, ప్రభాకర్ శెట్టి, ఆరూరు రామ్మూర్తి, లక్ష్మణ, బైసాని చంద్రశేఖరరావు, సంపత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రష్మిత అన్నారు. సోమవారం గుడిపాల మండలంలోని కమ్మతిమ్మాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రష్మిత 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, భాస్కర్, సరిత, దివ్య, శిల్ప, కిరణ్‌కుమారి, శివగామి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి



నియామకపత్రం అందజేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: ఉద్యోగ విధులను చిత్తశుద్ధితో నిర్వహించి నగరపాలక సంస్థకు మంచి పేరు తేవాలని నగర మేయర్ ఎస్.అముద చెప్పారు. చిత్తూరు నగర పాలక సంస్థలో సోమవారం కారుణ్య నియామకాల ద్వారా ఒకరికి, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కింద ఒకరికి ఉద్యోగ నియామక పత్రాలను మేయర్ అందజేశారు. నగర కమిషనర్ అరుణ సోమవారం అభ్యర్థుల దరఖాస్తుల మేరకు శుక్రవారం ధృవపత్రాల పరిశీలన, కుటుంబ సభ్యుల విచారణ చేపట్టి ఉద్యోగ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. నగర పాలక సంస్థలో గ్యాంగ్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన కె.సెల్వరాజ్ కుమార్తె కె.గుణవతికి గ్యాంగ్ మజ్దూర్‌గా, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కింద ఏసీ శేఖర్ కుమారుడు ఏసీ లోకేష్‌ను గ్యాంగ్ మజ్దూర్‌గా నియమించారు. కార్యక్రమంలో మేనేజర్ తనూజ పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్ ఈఈగా గోమతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఈఈ)గా టీపీ గోమతిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఈమెకు పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు కార్పొరేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి అవార్డులు



కృష్ణారెడ్డి



గుణశేఖర్



హిమబిందు



ఉమాదేవి



భారతి



నాగరాజ

యాదమరి: మండలంలోని పలు స్కూళ్లలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు నలుగురు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. యాదమరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి(యాదమరి), షబ్బీర్ బాషా(వరిగపల్లె), ప్రాథమిక పాఠశాలలో హిమబిందు(వరిగపల్లె ప్రైమరీ), గుణశేఖర్(పాచిగుంట) జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు రమాదేవి, హిందీ ఉపాధ్యాయురాలు భారతి జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వీరు అవార్డులు అందుకోనున్నట్లు ఎంఈఓ చెప్పారు

జిల్లా అవార్డుకు నాగరాజ

పూతలపట్టు: మండలంలోని వసంతాపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగరాజ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా విద్యాశాఖధికారి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. 2010వ సంవత్సరం బైటపల్లి పంచాయతీలో ఇద్దరు విద్యార్థులు ఉన్న పాఠశాలలో సంవత్సరం లోపే 16 మంది విద్యార్థులను చేర్పించారు. ఈయన విద్యార్థులకు తన సొంత డబ్బులతో విద్యాసామగ్రి, తల్లిదండ్రులు లేని పిల్లలను చదివించడంలో ముందుంటారు.

గురుదేవోభవ



దామోదర ఆచారి

యాదమరి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ గురుదేవోభవన అనే చిత్రాన్ని అద్భుతంగా వేశారు. గురువులేని విద్య రాణించదని, విద్య సమస్త కళలు, గురు బోధనలోనే సాధ్యమని, ఎద చీకటి తొలగాలంటే గురువుసేవే మార్గం, రాముడు, కృష్ణుడు ఇద్దరూ గురుసేవలో తరించిన మహనీయులే గురువు అడుగు జాడలే ప్రపంచానికి దిక్సూచి, నాటి గురుకులం నేటి పాఠశాల వరకు గురువే వారధి, సారధి అని చిత్రం ద్వారా తెలియజేశారు.



నీలి రంగులతో గీసిన గురుదేవోభవ చిత్రం

ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలి



జొన్నగురకల వద్ద పొలంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని ఏఓ జి.ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండలంలోని జొన్నగురకల, మత్యం గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవడంతో ప్రభుత్వం ద్వారా వివిధ రకాల పథకాల లబ్ధి పొందవచ్చని వివరించారు. దీంతో పాటు ఉచిత పశుబీమా, పంట రుణాలపై వచ్చే సున్నావడ్డీ అందుతుందని వివరించారు. రైతులు విధిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకుని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉప సర్పంచ్‌గా జయచంద్ర ఎన్నిక



ఉప సర్పంచ్ జయచంద్రను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఐరాల: మండలంలోని ఎం.పైపల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు 7వ వార్డు మెంబర్ జయచంద్ర ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్ రెడ్డి సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌ను శాలువాతో సత్కరించారు.

మట్టి సేకరణ



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

గుడిపాల: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అన్నారు. సోమవారం తిమ్మాపల్లె, మిట్ట ఇండ్లు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు సోమనాథగౌడ్ ఆధ్వర్యంలో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలో మట్టిని అమృతవనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నా దేశం-నా భూమి కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెడదామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్, సాయిప్రతాప్, శేఖర్, ఏలుమలై, మస్తాన్ పాల్గొన్నారు.

7న కాణిపాకంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఈ నెల 7వ తేదీన గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కాణిపాకంలో ఉచిత వైద్యశిబిరం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సమీపంలో చిత్తూరులోని మహేష్ స్పెషాలిటీ ఆర్థోక్లినిక్ ఆధ్వర్యంలో ఉచితంగా మంగళవారం వైద్యసేవలు అందించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని భక్తులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.